క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

అశ్వారావుపేటరూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని అశ్వారావుపేట మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.సంగీత అన్నారు. శనివారం మైనార్టీ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశం పొందిన విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఐదో తరగతి నుంచి 8వ తరగతి వరకు మైనార్టీ సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు ప్రవేశాలు పొందాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు ఆట, పాటలతో సందడి చేయగా, చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ చందానగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు మహంతి వెంకటకృష్ణాజీ, గాలి రామ్మోహన్‌రావు సత్తాచాటి బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. దీంతో ఈనెల 22 నుంచి 26 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఈ ఇద్దరు క్రీడాకారులకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఆపరేటర్ల వినతి

మణుగూరురూరల్: కొత్తగూడెం రీజియన్ స్థాయిలో ఆపరేటర్ల పదోన్నతులు, ఖాళీల భర్తీ చే పట్టాలని కోరుతూ సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.శామ్‌సుందర్‌కు శనివారం ఏరియా ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్స్ నాయకుడు ఎస్‌డి.నాసర్‌పాషా మాట్లాడుతూ.. కొత్తగూడెం రీజియన్ స్థాయిలోని మణుగూరు, సత్తుపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం ఓసి గనుల్లో పని చేస్తున్న ఏ గ్రేడ్ ఆపరేటర్ల పదోన్నతులకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అర్హత పరీక్ష రాసిన బి గ్రేడ్, ఏ గ్రేడ్ ఆపరేటర్లకు పదోన్నతి పత్రాలను బ్యాక్ డేట్‌లో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్లు మామిడి శ్రావణ్, కొండా రవిశంకర్, బి.రాందాస్, వట్టం శాంతయ్య, రాగుల ఎల్లయ్య, ఎస్.వెంకటరమణ, నునావత్ రమేష్, ఆశీర్వాదం, నాగరాజు, వి.రాజేష్, ఇసాక్, హతిరామ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌బుక్‌లు అందించాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రెయిన్‌కోట్లు, మెడికల్ అటెండెన్స్ పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) ఆధ్వర్యంలో మంగీలాల్ శనివారం ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఏరియా రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు మేస్త్రీలు, సివిల్ రోడ్లు క్లీనింగ్, పర్చేజ్ విభాగాలలో తప్పనిసరి పరిస్థితుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఉద్యానవన కార్మికులకు సూపర్‌వైజర్లకు రెయిన్‌కోట్లు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు గుర్తుమూర్తి, షేక్ రజబ్ అలీ, సాంబయ్య తదితరులు ఉన్నారు.

నిత్యావసరాల అందజేత

అశ్వాపురం: దోర్నకల్‌కు చెందిన ఎండి.బదర్ పాషా కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో మండల కేంద్రంలోని ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి శనివారం రూ.10 వేల విలువ గల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. మణుగూరు ఏరియా సింగరేణి సేవా కార్యదర్శి షేక్ షకిరాభేగం చేతుల మీదుగా బియ్యం, నిత్యావసర వస్తువులు వృద్ధాశ్రమానికి అందజేశారు. మణుగూరు ఏరియా సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్, ఎండీ.షకిల్, అక్బర్, మోతి, సల్మా, వృద్ధాశ్రమం నిర్వాహకులు షహనాజ్, మెహరాజ్ పాల్గొన్నారు.

రేపు ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

మణుగూరురూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై రేపు మణుగూరు మండల పరిషత్ కార్యాలయం స్త్రీశక్తి భవనంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రేపు ఉదయం 10గంటలకు ప్రజావేదిక ప్రారంభమవుతుందని తెలిపారు.

పవన్ అభిమానుల సమావేశం

మణుగూరురూరల్: పట్టణంలోని ఏపీ మంత్రి పవన్‌కల్యాణ్ పినపాక నియోజకవర్గ అభిమానుల సంఘం సభ్యులు శనివారం సంఘ కార్యాలయంలో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో నూతన కమిటీ ఏర్పాటుపై చర్చించారు. సంఘ సభ్యులు సురేందర్ పటేల్, బండ్ల బాల, ఒత్తుల అనిల్‌కుమార్, సాయిచరణ్, జెట్టి యుగేందర్, ప్రదీప్‌కుమార్, సాయి,వంశీ, రాజేష్, ఆటో బాలయ్య పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం!

- ప్రజలకు ధర్మ పరిరక్షణ, మానవసేవ సందేశం..
- కరకగూడెంలో వైభవంగా జరగనున్న వేడుకలు
- మొక్కులు తీర్చుకోనున్న 4 జిల్లాల భక్తులు



పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం (ఫైల్)



నిప్పులగుండం వద్ద భక్తులు

సండే స్పెషల్

కరకగూడెం: మొహర్రం మాసం ఆరంభం రోజున ముస్లింలకు 'ఇస్లాం'నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ప్రాచీన కాలంలో ఆషురా దినం అనగా ముహర్రం యొక్క 10వ తేదీన అనేక సాంప్రదాయక గుర్తుల కనుగుణంగా పర్వదినంగా జరుపుకుంటారు. ఆ చొప్పున సాధారణ క్యాలెండర్‌లో ఈ నెల 17న మొహర్రం జరుగుతుంది. న్యాయం, ధర్మం. సత్యం, మానవీయ విలువలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యుద్ధం చేసి అమరగతి పొందిన హజ్రత్ ఇమామ్ హుసేన్, ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీక మొహర్రం.కరకగూడెం మండల కేంద్రంలో దశాబ్దాలుగా ముస్లింలు కన్నులపండుగగా జరుపుకునే ఈ పండుగపై 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఇది మొహర్రం చరిత్ర..

ధర్మ పోరాటంలో భాగంగా మహాప్రవక్త హజరత్ మహ్మద్ మనవళ్లు హజ్రత్ ఇమామ్ హుసేన్, ఇమామ్ హుస్సేన్ల త్యాగ నిరతిని స్మరిస్తూ ముస్లింలు మొహర్రం జరుపుకుంటారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సర్వమత సమానత్వం, ప్రజాస్వామ్యం లాంటి గొప్ప ఆశయాలను మరిచి స్వార్థపరులు పదవీకాంక్ష ప్రదర్శించిన తీరును మొహర్రం గుర్తు చేస్తుంది. దీని వెనుక ఆసక్తికరమైన గాథ ఉంది.రాజ్యపాలన సక్రమంగా జరిగేందుకు వారసత్వ పాలనను తెరదించేందుకు రాచరిక స్థానంలో ప్రజలు కోరిన వ్యక్తినే పాలకునిగా స్వీకరించే పద్ధతిని మహాప్రవక్త మహమ్మద్ (స.అ.స) ప్రవేశపెట్టారు. చాలా కాలం ప్రజలు ఈ పద్ధతినే ఆచరిస్తూ హాయిగా జీవించేవారు. ఆ పరంపరలో హజరత్ అలీ తర్వాత ప్రజలు ఖలీఫాగా హజరత్ హసన్ ను కోరుకున్నారు. ఇది సహించలేని వారు ఆయనపై విష ప్రయోగం చేసి తుద ముట్టిస్తారు. ఆ తర్వాత ప్రజలు ప్రవక్త మనువడైన హజరత్ హుస్సేన్ను ఖలీఫాగా ఎన్నుకునేందుకు సిద్ధమయ్యారు. స్వార్థపరుడు, సిరియా ప్రతినిధి మావియా దీనిని అంగీకరించక తన కుమారుడు యాజీద్ను రాజుగా చేయాలని మొండి పట్టుతో యుద్ధానికి దిగగా ప్రజలు ఒప్పుకోరు.హజరత్ ఇమామ్ హుస్సేన్ ప్రజలు అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకొని రమ్మని ఓ ప్రతినిధిని పంపుతారు. ప్రజలంతా హజరత్ హుస్సేన్‌నే కోరుతున్నారని తెలుసుకున్న ఆ ప్రతినిధి విషయాన్ని తెలిపేందుకు వస్తుండగా యజీద్ ఆయనను మార్గమధ్యలోన్నే హతమారుస్తారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ఇమామ్ హుస్సేన్ తాను శాంతియుత సంప్రదింపుల కోసమే వస్తున్నానని 72 మంది తన శ్రేయోభిలాషులతో బయలుదేరుతారు. భయపడిన యాజీద్ ఆయనను కర్బా మైదానం వద్ద నిలువరించి యుద్ధానికి దిగుతారు. మొహర్రం మొదటి రోజు నుంచి పది రోజులు యుద్ధం జరిగాక హజరత్ ఇమామ్ హుస్సేన్ సైనికులంతా యాజీద్తో పోరాడుతూ నేలకొరుగుతారు. నమాజు సమయం కావడంతో ఆ రోజున ప్రార్థనల కోసం యుద్ధానికి విరామం ఇవ్వాలని హజరత్ హుస్సేన్ కోరుతారు. యజీద్ సైనికులు అంగీకరించినట్లు నటించి ఇమామ్ హుస్సేన్ నమాజ్ ప్రార్థనల్లో ఉండగా మట్టుబెడతారు. ధర్మరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన హజరత్ ఇమామ్ హుస్సేన్, హుసేన్ల బలిదానాన్ని స్మరిస్తూ మొహర్రం నెల ప్రారంభం నుంచి పది రోజులు స్మృతి దినాలుగా పాటిస్తారు. మొహర్రం పదో రోజున హజరత్ ఇమామ్ హుస్సేన్, హుసేన్ జ్ఞాపకార్థం 'యోమే ఆషురా'పాటిస్తూ విశేషంగా ప్రార్థనలు చేస్తారు. రెండు రోజుల పాటు ఉపవాస దీక్షలను చేపడుతారు. ఈ సందర్భంగా మసీద్ల మకాన్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు అన్నదానాలు చేస్తారు. మకాన్ల వద్ద పీర్లను ప్రతిష్ఠిస్తారు.

భక్తి శ్రద్ధలతో..

కరకగూడెం మండల కేంద్రంలో ప్రతి ఏడాది మొహర్రం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుగుతుంటాయి. పీర్ల చావడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలోనుంచి పీరీలను ఎత్తుకుని పలువురు నడుస్తుంటారు. ఈ ఉత్సవాలు తిలకించేందుకు, మొక్కులను సమర్పించుకునేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు,వరంగల్ జిల్లాల నుండి భక్తులు హాజరాయి ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారు. మొక్కులను చెల్లించుకుంటారు.భక్తులు కోరిన కోర్కెలు తీరుతాయని వారి ప్రగాఢ నమ్మకం. మొహర్రంను పురస్కరించుకొని ముజావరులు కఠిన నిష్ఠతో నెలపొడుపు చూసిన తరువాత పీరీల చావడి (దర్గా)వద్ద పీరీలను కొలువు తీర్చారు.అనంతరం పీరీలను ఎత్తుకుని ముజావరులు గ్రామాల్లోకి తీసుకెళ్తారు. దట్టీలు, మలీద, బెల్లం పానకం, సాంబ్రనితో తదితర నైవేద్యాలతో భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు. ఆరు రోజుల పాటు పీరీలను కొలువు తీర్చిన తరువాత ఏడో రోజు తెల్లవారు జామున చిన సరిగెత్తు నేడు (ఆదివారం) తొమ్మిదవ రోజున పెద్దసరిగెత్తు రూపంలో పీరీల పండుగను కన్నుల పండుగగా నిర్వాహకులు నిర్వహిస్తారు. పీర్ల చావిడి వద్ద చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలలో ముస్లింలతో పాటు హిందు సోదరులు పాల్గొని మత సామరస్యాన్ని ప్రదర్శిస్తారు.

మొహర్రం స్ఫూర్తితో ముందుకు..



ప్రజాస్వామ్యం మానవ హక్కుల కోసం శతాబ్దాల క్రితమే జరిగిన పోరాటమే మొహర్రం దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఇస్లాంకు మూలమైన త్యాగానికి మానవతావాదానికి ప్రతి ఒక్కరూ పునరంకితం అవ్వాలి. త్యాగ గుణాన్ని గౌరవించేదంకు వీరత్వం నుంచి స్ఫూర్తి పొందేందుకు జరుపుకునే మొహర్రం మానవాళిలో ఐక్యత నిండి ముస్లింలతో పాటు అన్ని వర్గాల వారు మొహరం స్ఫూర్తితో ముందుకు సాగుదాం.

– షేక్ ఇమామ్, కరకగూడెం

కులమతాలకు అతీతంగా..



సమాజంలో శాంతి, ప్రజాస్వామ్యం, మానవహక్కుల కోసం 14వ శతాబ్దంలో జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అసువులు బాసిన అమరుల సంస్కరణే మొహర్రం పండుగ సందేశం. వాస్తవానికి ఇవి విషాద రోజులైనప్పటికి మా ప్రాంతంలో పీర్ల పండుగను కులమతాలకతీతంగా జరుపుకుంటాం. మొహర్రంకు సంబంధించిన రోజుల్లో హిందూ, ముస్లింలందరం కలసి మెలసి ఏళ్లుగా దీనిని జరుపుకుంటున్నాం.

– మన్యం నరేష్, కరకగూడెం

వాగులు దాటి ప్రాణాలు కోల్పోవద్దు



వాగు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

గుండాల: వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తాయని ఆ వాగులు స్థానిక గ్రామాల ప్రజలు దాటొద్దని ఇల్లందు డీఎస్పీ చంద్రబాను అన్నారు. శనివారం ఆయన కాచనపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెట్టుపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెట్టుపల్లి సమీపంలోని లోలెవల్ వంతెనను పరిశీలించారు. వాగుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను గ్రామస్తుల సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వాగులు ఉధృతంగా వస్తాయని సమయంలో వాగులు దాటవద్దని అన్నారు. గర్భిణీలు ఉంటే ప్రసవానికి ముందే పట్టణ కేంద్రాలకు తరలించాలని సూచించారు. పిడుగులు పడే సమయంలో కూడా చెట్లకింద ఉండరాదని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. నూతన చట్టాలు, సైబర్‌క్రైం, డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక పోలీసుల దృష్టికి తీసుకరావాలని తెలిపారు. ఆయన వెంట సీఐ రవీందర్, కాచనపల్లి ఎస్సై సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గ్రామ సభలు

కరకగూడెం: మండలంలోని సమత్ మోతె, చొప్పలా, వెంకటాపురం, భట్టుపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ గ్రామ సభలు శనివారం నిర్వహించినట్లు మండల ఏపీఓ ఏ.శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా నేడు కరకగూడెం, సమత్ భట్టుపల్లి, పద్మాపురం, రేగళ్ల, తాటిగూడెం, వాట్టంవారిగుంపు, కన్నాయిగూడెం, తుమ్మలగూడెంలలో రేపు కొత్తగూడెం, రఘునాథపాలెం, చిరుమళ్ల, అనంతారం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, ప్రజలు తప్పకుండా గ్రామ సభలకు హాజరుకావాలని కోరారు.

'సీతారామ'తో జిల్లాకు అన్యాయం

బూర్గంపాడు: సీతారామ ప్రాజెక్ట్‌తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి జక్కుల రాంబాబు ఆరోపించారు. సారపాకలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భద్రాద్రి జిల్లాకు సాగునీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు సీతారామ జలాలను తరలించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భద్రాద్రి జిల్లాలోని ఏ ఒక్క మండలానికి కూడా సీతారామతో సాగునీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ముగ్గురు మంత్రులు కంకణం కట్టుకున్నారన్నారు. భద్రాద్రి ఏజెన్సీ జిల్లాను గాలికి వదిలేసి ముగ్గురు మంత్రులు తమ ప్రాంతాలకు సాగునీరు తీసుకెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. సీతారామ ప్రాజెక్ట్‌తో జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు రైతులతో కలసి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు వైఎస్ రెడ్డి, ముత్యాల సత్యనారాయణ, బర్ల రామకృష్ణ, సోమా వినోద, చిన్నమ్మాయి, లక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి వైద్య శిబిరం

కరకగూడెం: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యాధికారి పలువురు గ్రామస్తులను పరీక్షించి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులైనటు వంటి మలేరియా, డెంగ్యూ జ్వరాలను నివారించడానికి ప్రజలంతా తమ బాధ్యతగా చైతన్యవంతంతో తమ ఇండ్లలోని గోళాలు, డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలోని నీటిలో తోక పురుగులు లేకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కలియతిరుగుతూ నిల్వ ఉన్న నీటిని సిబ్బంది చేత పారబోయించారు. కాగా వైద్యాధికారి సిబ్బందితో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కాలినడకన రెండు కిలోమీటర్లు ద్విచక్రవాహనానం కూడా వెళ్లలేని మట్టి రోడ్డుపై నడుస్తూ వెళ్లారు. వైద్య శిబిరంలో ఆరోగ్య సహాయకులు కృష్ణ, నరసింహ, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం: కాలినడకన గ్రామానికి వెళ్తున్న వైద్యాధికారి మధు, సిబ్బంది

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం

అశ్వారావుపేటరూరల్: మండల వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. రోజంతా కురిసిన వర్షంతో 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా జోరుగా కురిసిన వర్షంతో అశ్వారావుపేట సంత మార్కెట్ ఆవరణలో వరదనీరు పొటెత్తగా.. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో వరదనీరు వచ్చి చేరింది. వర్షం కారణంగా ప్రధాన రహదారితోపాటు వీధులన్నీ జనసంచారం లేక వెలవెలబోయాయి.

దమ్మపేట: మండలంలోని పలుచోట్ల శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. రోజంతా తేలికపాటి జల్లులు పడుతుండటంతో, రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో జనసంచారం తగ్గింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు దమ్మపేట గ్రామంలోని చెరువుల వద్ద అలుగు కాలువలు పారడం మొదలయ్యాయి. రెవెన్యూ అధికారుల గణాంకాల ప్రకారం 20 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదయింది.



అశ్వారావుపేట సంతమార్కెట్‌లో వర్షపు నీరు..



పేరంటాల చెరువు అలుగు కాలువ ఉధృతి..

మంత్రి దృష్టికి ఆర్‌ఎంపీల సమస్య

గుండాల: ఏజెన్సీలో ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. శనివారం మండలంలోని గ్రామీణ వైద్యులు సీతక్కను కలిసి పలు సమస్యలను విన్నవించారు. తమపై ఐఎంఏ దాడులను ఆపాలని కోరారు. గత 30 ఏళ్లుగా గ్రామీణ వైద్యం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. ప్రథమ చికిత్స చేస్తూ ఎన్నో ఒడిదుడుకలను ఎదుర్కొంటూ, గిరిజనులతో సహజీవనం చేస్తున్నామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ ఇచ్చారని, తిరిగి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పందిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చినట్లు ఆర్‌ఎంపీలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో గొల్లపల్లి రమేష్, మహమూద్, సతీష్, భాస్కర్, రాము, నవీన్, రాంబాబు, నారాయణ, నాగరాజు, బాలు, విజయ్, నిర్మళ తదితరులు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి

మణుగూరుటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని కార్మిక కుటుంబాలు ఇంటా బయట పరిశుభ్రత పాటించడంతో పాటు ఆస్పత్రిలో వ్యాధులకు తగిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శనివారం ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ఆయన.. డీవైసీఎంఓ మేరీకుమారితో కలిసి ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. దోమల వ్యాప్తి, కుక్కల స్వైర విహార నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్స్‌పెక్టర్ జి.రామారావును ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ శేష గిరిరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీ పరిశీలన

అశ్వాపురం: ఇఫ్కో కంపెనీ సహకారంతో మండల కేంద్రానికి చెందిన డీలర్ భిక్షమయ్య ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో డ్రోన్ యంత్రం ద్వారా పురుగుమందు పిచికారీ చేపట్టగా.. వ్యవసాయ శాఖ ఏడీ తాతారావు, ఏఓ సాయిశంతన్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రోన్ యంత్రం ద్వారా పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా తక్కువ సమయం తక్కువ ఖర్చుతో మందులు కూడా ఆదా అవుతాయన్నారు. డ్రోన్ యంత్రానికి మండలానికి చెందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని భిక్షమయ్య సూచించారు. డీలర్ నేలపట్ల కోటిరెడ్డి, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.



డ్రోన్ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ తాతారావు, ఏఓ సాయిశంతన్ కుమార్

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

బూర్గంపాడు: భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న కొమ్మబత్తిని వీరబాబు వైద్యఖర్చులకు మోరంపల్లిబంజరకు చెందిన చేయూత ట్రస్ట్ ఆర్థికసాయమందించింది. కుక్కునూరు మండలం ఉప్పర మద్దిగట్ల గ్రామానికి చెందిన వీరబాబు ఐదురోజుల క్రితం కళ్లు తిరిగి పడిపోవటంతో తలకు తీవ్రగాయమైంది. వైద్య ఖర్చులకు ఉన్నవి అమ్మినప్పటికీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలిసి మోరంపల్లిబంజర చేయూత ట్రస్ట్ ప్రతినిధులు శనివారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయమందించింది. ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, కొండ్రు వెంకటేశ్వర్లు, కైపు నాగిరెడ్డి, మల్లారెడ్డి, రాజేష్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, బిజ్జం వెంకట్రామిరెడ్డి,బొబ్బల వెంకట్రామిరెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యతో కలిసి మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులు పొంగులేటిని ఘనంగా సన్మానించి పలు సమస్యలు విన్నవించారు. నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, సుతారపు రంగయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయంగా సేద్యం

- దశాబ్దాలుగా ఎవుసంలో దంపతులు
- సేంద్రియ పద్ధతుల అనుసరణ
- పశుపోషణ, తేనెటీగల పెంపకంపై దృష్టి
- అభినందించిన కలెక్టర్



తేనె ముక్కలను రుచిచూస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ములకలపల్లి: ఇరవై ఏళ్లనాటి ఆయిల్‌ఫాం చెట్లు, తేనెటీగెలు, నాటుకోళ్ల వంటి జీవాల పెంపకం, పది ఎకరాల్లో ఎటుచూసినా పచ్చదనం ఇదీ రాజుపేట శివారులోని రైతు కనకదుర్గ జైచందర్ రావు దంపతులకు చెందిన వ్యవసాయ క్షేత్రం ముఖచిత్రం ఇది. ఇటీవల అక్కడకు వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గంటకుపైగా సమయాన్ని కేటాయించిన తరుణంలో 'ఈ ప్రదేశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)'గా అభివర్ణించారు. ఇక్కడ 'కేవీకే అంటూ బోర్డు పెట్టాలి'అంటూ కితాబిచ్చారు. రైతు దంపతులను కలెక్టర్ స్వయంగా దుశ్శాలువతో సత్కరించారు.

ములకలపల్లి మండలకేంద్రానికి రాజుపేట సమీపంలో చిలకపాటి కనకదుర్గ, జైచందర్‌రావు రైతుదంపతులు సమీకృత సేద్యం చేస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. పది ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో తేనెటీగల పెంపకంతోపాటు, మేకలు, ఆవులు, గేదెలు, నాటుకోళ్లు పెంచేతున్నారు. వినూత్న పద్ధతులు పాటిస్తూ, సేంద్రియ ఎరువులు వినియోగిస్తూ చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు సుమారు 30 ఏళ్ల క్రితం ఇక్కడ సేద్యం ఆరంభించగా, అప్పటి అధికారుల ప్రోద్బలంతో మండలంలోనే మొదటిసారిగా ఆయిల్‌ఫాం సేద్యానికి పూనుకున్నారు. తదుపరి కాలంలో ఆ పంటే కామధేనువుగా మారింది. అటుపిమ్మట కొంతస్థలంలో జామ, నిమ్మ వంటి పళ్ల మొక్కలు నాటినా కోతుల దాటికి దిగుబడి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. వ్యవసాయంపై మక్కువతో వినూత్నంగా ఆలోచించారు. నాటుకోళ్ల పెంపకం చేపట్టారు, ఇక్కడ వివిధ రకాలకు చెందిన సుమారు 200 నాటుకోళ్లు ఉన్నాయి. ప్రత్యేకంగా షెడ్లు నిర్మించి, వీటిని పోషిస్తున్నారు. ఇక్కడ ఇరవైకిపైగా మేకలు పెంచుతున్నారు. వీటి మేత కోసం సూపర్‌నేపియర్ గడ్డిని పెంచుతున్నారు. పశువైద్యుల సలహాలు సూచనలు మేరకు సత్ఫలితాలు సాధిస్తున్నారు. త్వరలో చేపల పెంపకం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సేంద్రియ సేద్యమే లక్ష్యంగా ...

ఆయిల్‌ఫాం చెట్లకు సేంద్రియ ఎరువు నిమిత్తం పశువులను సాకుతున్నారు. వీరి వద్ద 7 ఆవులు, 20 గేదెలు ఉన్నాయి. ఇందుకుగాను ప్రత్యేకంగా షెడ్డు నిర్మించారు. వీటి మూత్రం, పేడను చెట్లకు ఎరువుగా వినియోగిస్తున్నారు. వీటిని ట్రాక్టర్ ట్యాంకర్‌లో నింపేలా ప్లాన్ చేశారు.. అక్కడి నుండి ఆయిల్‌ఫాం మొక్కలకు వీటిని అందిస్తున్నారు.

'ఆహా ఏమి రుచి'..

తేనెటీగల పెంపకాన్ని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఎలా దీనిని ఏర్పాటు చేశారంటూ రైతు దంపతులను అడిగి తెలుకున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నామని, అన్ని మెళకువలు తెలుసుకున్నాకే, ఆరంభించామని చెప్పడంతో కలెక్టర్ అభినందించారు. ఆరు నెలల క్రితం ప్రయోగాత్మకంగా ఇక్కడ చేపట్టామని వివరించారు. ఎటువంటి కల్తీకి అవకాశంలేకుండా తేనె తుట్టెలను కేక్ ముక్కలుగా కోసి, ఆ ముక్కలనే విక్రయిస్తామని తెలుపడంతో ఆశ్చర్యపోయారు. ప్యాకెట్లలో అమ్మకానికి ఉంచిన తేనెతుట్టెల ముక్కలను స్వయంగా రుచి చూశారు. 'ఆహా ఏమి రుచి'అంటూ ఆనందం వ్యక్తం చేశారు.